# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-05-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఎన్నికల ప్రచారంలో సున్నితమైన అంశాలపై ఎటువంటి ప్రకటనలు చేయకూడదని రాజకీయ పార్టీలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.**
2. **ఈవీఎంలను ధ్వంసం చేసిన ఘటనలో కేసులను నమోదు చేశామని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం విస్తృతంగా తనిఖీలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పోలీస్ శాఖ తెలిపింది.**
4. **తెలంగాణ వ్యాప్తంగా బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ పరీక్ష ఈ రోజు జరుగుతుంది.**
5. **ఈరోజు బుద్ధ పూర్ణిమ పర్వ దినాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు.**

==========================

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం సున్నితమైన అంశాలపై ఎటువంటి ప్రకటనలు చేయకూడదని రాజకీయ పార్టీలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ మేరకు ఎన్నికల సంఘం రాజకీయ పార్టీలకు లేఖ రాసింది. సమాజాన్ని విభజించే విధంగా ప్రసంగాలు చేయడం సరికాదని, భారతదేశంలో సమ్మిళిత సాంస్కృతిక అంశాలు చాలా సున్నితమైనవని అందుకు అనుగుణంగా ప్రచార పద్ధతులు ఉండాలని ఎన్నికల సంఘం పేర్కొంది. రక్షణ దళాలపై రాజకీయ వ్యాఖ్యలు చేయవద్దని, భారత రాజ్యాంగం రద్దు చేస్తారనే అసత్య ప్రచార ప్రకటనలు చేయవద్దని ఎన్నికల సంఘం ఆదేశించింది.

-------------------------

విద్యార్థులు జీవితంలో నైతిక విలువలు పాటిస్తూ సమాజ హితం కోసం కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని వెంకటాచలం మండలం, కాకుటూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ వేడుకల్లో నిన్న గవర్నర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ కోర్సులలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ... విద్యార్థులందరూ తమ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని నెరవేర్చుకునేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థి దశలోనే ఎన్నో విషయాలు తెలుసుకునేందుకు వీలవుతుందని, విశ్వవిద్యాలయంలోని వనరులను వినియోగించుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని గవర్నర్ ఆకాంక్షించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో  పోలింగ్ రోజున 9 చోట్ల ఈవీఎంలను ధ్వంసం చేశారని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. వెలగపూడి  రాష్ట్ర సచివాలయంలో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పల్నాడు జిల్లా మాచర్లలోనే 7 ఘటనలు చోటుచేసుకున్నాయని, ఈ ఘటనలను  వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలించామన్నారు. ఈవీఎంలు  ధ్వంసమైన డేటా సురక్షితంగా ఉందని తెలిపారు. నింధితుల వివరాలని ప్రత్యేక దర్యాప్తు బృందం- సిట్‌కు అందించామని తెలిపారు. మే 20న రెంటచింతల ఎస్.ఐ. కోర్టులో మెమో దాఖలు చేశారని, అందులో మొదటి నిందితుడిగా పిన్నెల్లి రామకృష్ణ రెడ్డిపై  కేసు నమోదు చేసామని చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో  ఏర్పడే నూతన ప్రభుత్వ సహకారంతో, ఉభయ తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందేలా కృషి చేస్తానని, తెలంగాణ  ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నిన్న  తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి వారిని ముఖ్యమంత్రి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో ముఖ్యమంత్రి దంపతులకు వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థప్రసాదాలు అందజేసి శేష వస్త్రాన్ని, స్వామివారి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రి  పాత్రికేయులతో మాట్లాడుతూ,  ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, స్వామి వారి ఆశీస్సులతో తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలని కోరుకున్నట్లు  చెప్పారు. అలాగే తిరుమలలో, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున కళ్యాణ మండపం, వసతి గృహం ఏర్పాటుకు, నూతన ప్రభుత్వ సహకారం తీసుకుంటామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తోందని ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. కార్డన్ సెర్చ్ సోదాల్లో భాగంగా ఇప్పటివరకు రాష్ట్రంలో 168 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి ఎటువంటి పత్రాలు లేని 803 వాహనాలను జప్తు చేశామని తెలిపింది. 185 లీటర్ల సారా, 18.94 లీటర్ల అక్రమ మద్యం, ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తరలించిన 107 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించింది. అసాంఘిక శక్తుల కదిలికల గురించి టోల్ ఫ్రీ నంబర్లు 100 అదేవిధంగా మరొకటి 102లకు సమాచారం అందించాలని పోలీసు శాఖ కోరింది.

---------------------------

తెలంగాణ వ్యాప్తంగా  బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే తెలంగాణ  స్టేట్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ -టిజి ఎడ్ సెట్ పరీక్ష ఈ రోజు జరుగుతుంది. ఈ ఏడాది ప్రవేశ పరీక్ష కోసం రాష్టవ్యాప్తంగా మొత్తం 79 కేంద్రాలను  ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో  పరీక్ష రాసే  అభ్యర్థుల కోసం  విజయవాడ, కర్నూలు నగరాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు రెండు విడతలలో  ప్రవేశ పరీక్ష జరుగుతుంది.

---------------------------

తెలంగాణలోని అన్ని అంగన్వాడి కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను కల్పించి వాటిని మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర  స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర

సచివాలయంలో నిన్న సంబంధిత అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణాలో ఉన్న అంగన్వాడి కేంద్రాలన్నీ ఒకే విధంగా ఉండేలా రూపకల్పన చేయాలని సూచించారు. ప్రతీ అంగన్వాడి కేంద్రంలో స్వచ్ఛాలయాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు.

---------------------------

ఈ రోజు బుద్ధ పూర్ణిమ పర్వ దినాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. వైశాఖ మాసం శుక్ల పక్షంలో వచ్చే పౌర్ణమిని బుద్ధ పూర్ణిమ వైశాఖ పూర్ణిమ అని పిలుస్తారు. వైశాఖ పూర్ణిమ రోజునే గౌతమ బుద్ధుని జననం జరిగిందని, అందుకే ఈ పర్వ దినాన బుద్ధ పూర్ణిమ వేడుకలు జరుపుకుంటారని చరిత్ర చెబుతోంది. బుద్ధ పూర్ణిమ సందర్భంగా దేశ ప్రజలకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగ్ దీప్ ధన్‌ఖడ్ శుభాకాంక్షలు తెలిపారు.

గౌతమ బుద్ధుడు సత్యం, అహింస, సామరస్యంతో జీవించాలని మానవాళికి శాంతి సందేశాన్ని అందించారని సామాజిక మాధ్యమం వేదికగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. బుద్ధుని బోధనలు సహనం, స్వీయ-అవగాహన, సత్ప్రవర్తనతో కూడిన మానవ సేవ చేయడానికి ప్రతి ఒక్కరికి స్ఫూర్తినిస్తాయని ఉపరాష్ట్రపతి జగదీప్ దన్‌ఖడ్ తెలిపారు.

---------------------------

లోక్ సభ ఎన్నికల ఏడో దశలో 8 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి మొత్తం 904 మంది అభ్యర్థులు పోటీ చేయనున్నారని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. జూన్ 1వ తేదీన జరిగే ఏడో దశ లోక్‌సభ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా 57 పార్లమెంటరీ నియోజకవర్గాల నుంచి మొత్తం 954 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. ఈ చివరి దశ పోలింగ్‌లో ఉత్తరప్రదేశ్, పంజాబ్‌లో 13 స్థానాల చొప్పున, పశ్చిమ బంగాలో 9, బీహార్లో 8, ఒడిసాలో 6, హిమాచల్ ప్రదేశ్లో 4, జార్ఖండ్‌లో 3, కేంద్ర పాలిత ప్రాంతం చండీగఢ్‌లో ఒక స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. ఓట్ల లెక్కింపు జూన్ 4వ తేదీన జరగుతుంది.

---------------------------

ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర రహదారి రవాణా సంస్థ- టీఎస్ ఆర్టీసీ పేరును టీజీఎస్‌ఆర్టీసీగా మార్పు చేసినట్లు తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అధికారికంగా వెల్లడించారు. త్వరలోనే టీఎస్‌ఆర్టీసీ నుంచి టీజీఎస్ ఆర్టీసీగా చిహ్నంలో మార్పులు చేసి కొత్త లోగోను ప్రకటిస్తామని తెలిపారు.

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్ -ఐపిఎల్ క్రికెట్ టోర్నమెంటులో భాగంగా నిన్న అహ్మదాబాద్‌లో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో రాజస్థాన్ జట్టు 4 వికెట్ల తేడాతో బెంగళూరు జట్టుపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది. అనంతరం రాజస్థాన్ రాయల్స్ జట్టు 19 ఓవర్లలో 6 వికెట్లకు 174 పరుగులతో విజయం సాధించింది. కాగా ఈ మ్యాచ్ లో విజయం సాధించిన రాజస్థాన్ రాయల్స్ జట్టు రేపు జరగనున్న క్వాలిఫర్-2 మ్యాచ్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుతో పోటీ పడనుంది.

======================